క్లుప్తంగా

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 31, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 70, పచ్చ కాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 38, దొండ 23, గుండుబీన్స్ 90, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 26, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

గిరిజనశక్తి, బీఎస్‌ఎఫ్ నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గిరిజన శక్తి, బీఎస్‌ఎఫ్, ఓయూ జాక్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులతో ఆందోళనకు దిగిన గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ ,అలాగే ఎన్‌ఆర్‌ఎస్ హాస్టల్ ఎదుట బీఎస్‌ఎఫ్ నేతలు వేల్పుల సంజయ్, పులిగంటి వేణుగోపాల్‌తో పాటు జాక్ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతిని అరెస్ట్ చేశారు.

కేఫ్ పాలిటిక్స్.. మంచి స్పందన

రసూల్‌పురా: కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమంలో యువకుల ఆలోచన విధానం, రాజకీయాలు, సమస్యలు తెలుసుకునే వీలుందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. కంటోన్మెంట్ ఆరవ వార్డు తాడ్‌బంద్ చౌరస్తాలోని గోల్డెన్‌పాయింట్ కేఫ్‌లో శుక్రవారం కంటోన్మెంట్‌కు చెందిన పలువురు యువకులతో 5వ కేఫ్ పాలిటిక్స్‌లో భాగంగా క్రిశాంక్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాజకీయాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు, అభివృద్ధి, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో సంజయ్, నవీన్, రఘు, కళ్యాణ్, హరీష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

అడ్డగుట్ట: డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. శుక్రవారం శాస్త్రినగర్‌లో సీవరేజ్ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని బస్తీవాసులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ స్రవంతి, బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, మహ్మద్, గౌస్, శ్రీరామ్, గణేష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ఇన్‌చార్జ్ ఏసీపీగా సుధీర్

రసూల్‌పురా: నార్త్‌జోన్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన తిరుమలగిరి డివిజన్ ఇంచార్జ్ ఏసీపీగా గోపాలపురం ఏసీపీ సుధీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్ఖాన మోడల్ పోలీస్‌స్టేషన్ రెండవ అంతస్థులోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల సరిహద్దులు, క్రైమ్ కేసుల వివరాలు ఇతర అంశాలపై చర్చించారు.

ఓయూలో నల్ల జెండాలతో నిరసన



ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు నల్లజెండాలు, బెలూన్లతో నిరసన తెలిపారు. శుక్రవారం ఓయూ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలపగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. తొమ్మిదేండ్ల పాలనలో ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం విఫలమైందని, అభివృద్ధి పేరుతో దోచుకుంటూ అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో బోరెల్లి సురేష్, నాగరాజు, దాత్రిక స్వప్న, ఈశ్వర్, దేవేందర్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

అడ్డగుట్ట: కలుషిత నీటి సరఫరాతో అవస్థలు పడుతున్నామని తుకారాంగేట్ సాయినగర్‌లో ఇంటి నెం. 1-5-572 సమీపవాసులు వాపోతున్నారు. గత నెల రోజుల నుంచి కలుషిత నీరు వస్తున్నాయని తాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే కాని, సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. స్థానిక నాయకులు, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని తుకారాంగేట్ సాయినగర్ వాసులు కోరుతున్నారు.



రసూల్‌పురా: బోయిన్‌పల్లి ఫ్లేగ్రౌండ్ వద్ద వేడుకల్లో మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఓయూలో ప్రొ.జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఉద్యోగులు



అడ్డగుట్ట: పార్టీ నేతలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తదితరులు

వాడవాడలా ‘దశాబ్ది’ సంబురం

- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాల ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు

సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో అంబరాన్నంటాయి. వాడవాడలా మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. తెలంగాణ అమరవీరులకు జాతి ఘన నివాళులు అర్పించింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అని తేడా లేకుండా అన్నిచోట్ల ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని ఆవిర్భావ శుభాకాంక్షలను తెలుపుకొన్నారు. వినోద, ఆట, పాటలతో హోరెత్తించారు. పలువురు సేవా కార్యక్రమాలతో స్ఫూర్తినింపారు.

టీఎస్‌పీసీబీలో...

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. చీఫ్ ఇంజినీర్ రఘు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీవాత్సవ, కార్యదర్శి కృపానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో తెలంగాణ అవతరణ ఉత్సవాలను విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు, అధికారులు ఘనంగా చేసుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద ఓయూ వీసీ రవీందర్ జాతీయ జెండాను ఎగుర వేశారు.



సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కార్పొరేటర్ సామల హేమ



చిలకలగూడ నాగులూరివీధిలో అవతరణ వేడుకలు



తార్నాక చౌరస్తాలో.. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న టీఎస్‌పీసీబీ మహిళా ఉద్యోగులు



దేవీనగర్‌లో...



బన్సీలాల్‌పేట్ జబ్బార్ కాంప్లెక్స్ వద్ద కార్పొరేటర్ హేమలత...



బేగంపేట స్వామిరామానందతీర్థలో శేఖర్ మారంరాజు



సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి...



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ వెంకటి...



బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్...



బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి...



నామాలగుండులో.. సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు



వారాసిగూడలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్

గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



లాలాపేట: గవర్నర్ డా. తమిళిసై శుక్రవారం రాజ్‌భవన్‌లో సికింద్రాబాద్ నియోజక వర్గం తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన, రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్‌రావు, నాయకులు ప్రకాష్‌గౌడ్, జమ్మికుంట వేణు, కృష్ణమూర్తి, అనూష, సరోజ, సత్యవతి తదితరులున్నారు.

బాల కార్మికులను రక్షించిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: మహారాష్ట్ర నుంచి నగరానికి తరలిస్తున్న 8 మంది బాల కార్మికులను రైల్వే రక్షణదళం బృందాలు శుక్రవారం రక్షించాయి. బాలకార్మికులను నగరంలోని వివిధ కర్మాగారాల్లో పనిచేసేందుకు అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆర్‌పీఎఫ్ బందాలు బచ్‌పన్ బచావో ఆందోళన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో దాడులు నిర్వహించారు. నలుగురు రవాణాదారులను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ బృందాలను రైల్వే రక్షణదళం సికింద్రాబాద్ డివిజనల్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత సి బెనర్జీ అభినందించారు.

ట్రాఫిక్ పీఎస్ ప్రారంభం

కంటోన్మెంట్: తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిని తగ్గిస్తూ కొత్తగా బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ఇటీవలే ప్రకటించారు. ఈ మేరకు నూతన పీఎస్‌కు ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లతో సహా మొత్తం 32 మంది సిబ్బందిని నియమించారు. నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన నాగేశ్వర్ రావుతో పాటు సిబ్బంది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి విధులు ప్రారంభించారు. బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ పరిధిలోనే ప్రాంతాలతో పాటు కార్ఖానా పరిధిలోని కొన్ని ఏరియాలతో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధి ఉండనుంది.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

లాలాపేట: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధనకు రానున్న రోజుల్లో జరుపతలపెట్టిన మాదిగల శక్తి ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలనీ ఎమ్మెస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శాంతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెల 10న ఖైరతాబాద్‌లోని మోడరన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే హైదరాబాద్ జిల్లా ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాల సన్నాహక సమావేశానికి సికింద్రాబాద్ నియోజక వర్గం నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలనీ కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్, జ్ఞానేశ్వర్, నరహరి, ఎల్లయ్య, అరుణ్, శివ, ఉపేందర్, బల్‌రాం,వరప్రసాద్, శ్యామ్, శంకర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్ము శేఖర్

నా భర్త వెళ్లిపోయాడు.. వెతికి పెట్టండి

- పోలీసులకు భార్య ఫిర్యాదు

కంటోన్మెంట్: నా భర్త తన ఫ్రెండ్ భార్యతో కలిసి పారిపోయాడంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మారేడుపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నేతాజీ వెల్లడించిన వివరాల మేరకు వ్యాపారస్తుడైన అతుల్ వడ్డోరియా (45), భార్య పారుల్ (44) పిల్లలతో కలిసి బోయిన్‌పల్లి ఆరావళి ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్నాడు. గత నెల 29న రాత్రి షిరిడీకి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయలుదేరగా, అతని కుమారుడు అతుల్‌ను జేబీఎస్ బస్టాండ్‌లో వదిలి వచ్చాడు. మరునాటి ఉదయం పారుల్, భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయి ఉంది. ఇంతలోనే ఇంట్లో అతుల్ రాసి పెట్టిన ఓ లేఖ లభించింది. ఇందులో తాను మిత్రుడి భార్యతో ప్రేమలో ఉన్నానని, ఆమెతో కలిసి వెళ్తున్నానని అతుల్ వెల్లడించాడు. మా ప్రేమ విషయం అతడికి కూడా తెలుసని పేర్కొన్నాడు. ఇంటి నుంచి రూ.10 లక్షల నగదు, మూడు బంగారు రింగ్‌లు, ఒక బంగారు చైన్ తీసుకెళ్లిన అతుల్, తాను ఇకపై ఆమెతోనే కలిసి జీవిస్తానని, తన కోసం వెతకొద్దంటూ రాశాడు. ఈ మేరకు పారుల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేవంత్ ప్రతిభ

సికింద్రాబాద్: ఎల్‌బీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫల్‌మండికి చెందిన రేవంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నాడు.రేవంత్ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 55, క్లీన్ అండ్ జర్క్‌లో 81 కిలోలు ఎత్తి మూడవ స్థానంలో నిలిచాడు. బాలుడికి తెలంగాణ సాట్ ఛైర్మన్ ఆంజనేయగౌడ్ పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు శివ, శ్రవణ్, హేమ, రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడ డీఐగా రుక్మిణి

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పరిగి రుక్మిణి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన రుక్మిణి మొదటి పోస్టింగ్ ఎస్‌ఆర్‌నగర్‌లో ఇచ్చారు. ఉమెన్ వింగ్, షీ టీమ్, భరోసా తదితర విభాగాల్లో పనిచేశారు. షీటీమ్‌లో పనిచేస్తున్న ఆమె బదిలీపై చిలకలగూడ డీఐగా నియమితులయ్యారు.

డా.రామకృష్ణకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు డా.రామకృష్ణను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు.